# సేద్యం

## శ్రీనివాసమూర్తి

పొద్దున్నే కుళాయి దగ్గర బిందెల చప్పుడుతో మెళకువొచ్చింది. ఆదివారం కాబట్టి రెండు పుస్తకాలు ముందేసుకుంటే ఈ రోజంతా వాటిల్లో మునిగితేలొచ్చు అనుకొని ముందు టీ తాగొద్దామని బైటికొచ్చినాను. రోడ్డు దిగి శ్మశానం పక్కనే వున్న హోటల్లో దూరినాను.

టీ తాగి బైటికొస్తుంటే సుబ్బయ్యత్త కనిపిచ్చినాడు. యింత పొద్దున్నే సన్నెతుక్కుంటూ సుబ్బయ్య ఎందుకొచ్చినాడో? దగ్గరికి రాగానే "ఏం సుబ్బయ్యత్తా బాగున్నావా? రాములు బాగున్నాడా?" అని అడిగినా.

సుబ్బయ్య "ఊఁ" అన్నాడు.

యింటర్మీడియట్లో సుబ్బయ్యత్త కొడుకు రాములు నాకు క్లాస్‌మేటు. చదువుకునే టప్పుడు నేనూ, రాములూ కలిసి స్టూడెంట్స్ యూనియన్లో పనిచేసినాము. యింటర్ రెండో సంవత్సరంలో రాములు పార్టీలోకి పోయినాడు. నాకు మాత్రం ఆ ధైర్యం లేకపోయింది. యం.ఎస్సీ చేసి ప్రైవేటు స్కూల్లో టీచరుగా పనిచేస్తున్నాను.

నా ప్రశ్నకు సమాధానంగా సుబ్బయ్యత్త ఏమీ మాట్లాడలేదు. నా ఎంటే వొచ్చినాడు. రూముకు పోయినాక సుబ్బయ్య మంచంమీద కూర్చొని, మాట్లాడటం మొదలుపెట్టాడు. "నాల్నెల్లముందు మా వోడు జైలునుంచి ఇంటికొచ్చినాడు గదా? వాన్ని బైటికి తానీక బెయిల్లకోసం ఎంత తిప్పలు పడినాసామీ! నీకు తెలవందిగాదు, ఇంటికొచ్చి నెల్రోజులు బాగున్నాడు. మళ్ళీ యిప్పుడు వూర్లో వాయసు పిలగాళ్ళందర్నీ ఎంటేసుక్కొని తిరుగుతా వున్నాడు. బడికి బోదగడ్డి కప్పిస్తానని మొన్న డబ్బులు జమచేసినాడు. రేత్రి సత్రంకాడ మాలోల్లకి సదువులు జెప్తావున్నాడు. ఇవన్నీ ఈనికెందుకొచ్చిన పన్లు, వూర్లో అందురు ఈనిమాదిరే జేస్తావున్నారా?" సుబ్బయ్యత్త మాటలను సగంలోనే ఆపేసినాడు. మధ్యలో నా వైపుచూసి "ఇంతెందుకు నువ్వుగూడా మావోనితోపాటి పార్టీలో తిరిగినోడివేగద, నువ్వు సదువుకోలా? ఏదో నాలుగురాళ్ళు సంపాయిస్తా వుండావు". సుబ్బయ్య మాటలకు నాకు కలుక్కుమని డిగబడింది. ఏం మాట్లాడాలనో తోచలేదు.

మొన్నేమో ఎంగటాద్రినాయుడు యింటికాడికి ఇనిస్పెక్టరొచ్చినాడు. ఊర్లో

484

కనిపిచ్చి ఏంరా! సుబ్బయ్యా, మీవోడు మళ్ళీ తిరగతా వున్నాడంటనే అన్నాడు, నాకైతే కాళ్ళు సల్లగయిపోయినాయి, లేదు సామీ, సర్కారు బడికి బోదకప్పెచ్చనీక తిరగతా వున్నాడంతే, అన్నాను. నా మాటలు ఇనిపిచ్చుకుంటేనా,

"అపద్దాలు చెప్పొద్దు పెద్దాయనా! డబ్బులొసూలుచేసి ఇస్కూలు సక్కదిద్దాలని మీ వోనికే ఏంటికి బట్టింది. లెక్కలు వొసూలు జేసోక్కని డబ్బులన్నా మిగిలిచ్చుకోవాల, లేకుంటే మళ్ళీ పార్టీ కోసమన్నా పనిజెయ్యాల. అయినా లెక్కలు ఎగేసేంత మంచోడుగాదు మీవోడు. కొబట్టి కొంచెం జాగ్రత్తగ చూసోక్క, ఈ సారి పైనుంచి అర్డరొస్తే మేం చేసేది ఏంలేదు". అన్నాడు పక్కనున్న హెడ్‌కానిస్టేబులు.

"నాకైతే జీవం బొయినట్లనిపించి సామీ"—

"వొక్కటే నలుసు, వాన్ని సదివిద్దామని కాలేజీల జేరిపిస్తి, సదువా సట్టుబండలయ్యింది, పార్టీ, పార్టీ అనిజెప్పి దానికోసం, ముసిలోల్లనిగూడ జూడకుండ మమ్ముల నిడిసిపోయినాడు. జైల్లోబడితే ఏమైంది, మంచికాళ్ళు బట్టుకోని నేనే యిడిపిచ్చుకొస్తి, మళ్ళీ యింటికి దెచ్చుకుంటి. ఇంతకొడుంటే నాల్గెకరాలూ దున్నుకోని యింత తినొచ్చునని జెప్తే ఈడు యినడు. ముసలితనంల, సచ్చేదనక నేనే కష్టం జెయ్యాల్నా. వాడొచ్చినకాణ్ణుంచి, సేనికాడ వాడే వుంటున్నాడు. నాల్నెల్లనుంచి పానానికి సుకంగుంది పిల్లనుదెచ్చి పెత్తాల అమాశలోపు మూర్తంగూడ పెడ్డామనుకుంటున్న. యిప్పుడు మళ్ళీ యివన్నీ బెట్నాడు. ఈసారి గనక వాణ్ని పట్కపోతే నేం సచ్చిపోతా సామీ?" సుబ్బయ్య గొంతు పీలగా అయ్యింది. మీదిపంచెతో కండ్లు తుడుచుకున్నాడు.

అయన్ను ఎలా వోదార్చాలో అర్థంకాలేదు. ఈ విషయంలో సలహా యివ్వగలిగిన అర్హత నాకు లేదు. అందుకనే మాట్లాడకుండా కూర్చున్నాను.

కొద్దిసేపటికి సుబ్బయ్య తేరుకున్నాడు. "ఆ పూర్లవుంటే వాడు యిట్నే తిరగతా వుంటాడు. అందుకని యీడికి తోలుకోనొచ్చి మన మల్లారెడ్డి సారుకాడ యిడుస్తామనుకుంటావున్నా. యీడుంటేనన్నా మెదలకుండా వుంటాడు. రెండు సంవత్సరాలుంటే నాల్గెకరాలూ అమ్ముకోని నేనూ, ముసిల్దీ యిద్దరం యీడికే వస్తాం. వేద్యం

జేసి మేం మాత్రం ఏం బావుకున్నాం. రైతు బతికే కాలంగాదు-కలికాలం కనాకష్టమై యిత్యంది".

ఈ చివరి మాటలతో సుబ్బయ్య వచ్చిన పనేమో నాకర్థమైయిత్యంది. "వుద్యో గాలు ఎక్కడ దొరుకుతాయి సుబ్బయ్యా, రాములుకు యిచ్చినా మూడు, నాలుగు వందలిస్తారు. దాంతో ఎట్లా బతుకుతాడు" సర్దిచెప్పాలని ప్రయత్నించాను.

"అదిగాదు సామీ! మల్లారెడ్డిగారు మీకు తెలిసినాయనేకదా? మా సుట్టుపక్కల పూళ్ళల్లో రోడ్డుపన్లు, మిద్దెలు కాంటాక్టు జేస్తావుండాడు. మొదట్నుంచి మీరు, మీరు కల్సి తిరిగినోళ్ళేకదా? నువ్వు అడిగితే కాదనడు. అ సామికాడ యిడిస్తే మేస్త్రి పనైనా యిస్తాడు-ఏదో పిలగాడు బతుక్కుంటాడు". వొచ్చే అదివారం మా వోణ్ని తోలుకొస్తా, మల్లారెడ్డిగారు కాడికి తీస్కబోయ్యి నువ్వే జేప్పాల-" అంటూ నాకు మాట్లాడటానికి అవకాశం యివ్వకుండానే మెట్లు దిగిపోయినాడు.

× × × ×

సుబ్బయ్య రావడంతో పొద్దున నేను అనుకున్న పన్లన్నీ ఎనకముందులై నాయి. రాములు గురించీ, మల్లారెడ్డి గురించే ఆలోచనలు అన్నీ.

నేనూ, రాములూ ఇంటర్ చదివేటప్పుడు మల్లారెడ్డి మాకు సీనియర్. మాకు పుస్తకాల దగ్గర్నుంచి, రాజకీయాల వరకు పరిచయం చేసింది మల్లారెడ్డే. డిగ్రీ అయ్యేంతవరకు మల్లారెడ్డి చాలా చురుగ్గా వుండేవాడు. కాలేజీలో ఏ ఫంక్షన్ జరిగినా మల్లారెడ్డి ఉపన్యాసంకోసం స్టూడెంట్స్ అందరూ ఎదురుచూసేవాళ్లు. గౌరవంగా 'సార్' అని పిలిచేవాళ్ళు. డిగ్రీ పూర్తయ్యేలోపు మల్లారెడ్డిమీద పోలీసులు రెండు కేసులు పెట్టారు. మొదటిసారి వాళ్ళ నాయన పట్టిచ్చుకోలేదు. అ తరువాత ఎం.ఎల్.ఏ.ను పట్టుకోని ఒక కేసునుంచి తప్పిచ్చినాడు. రెండో కేసునుకూడా ఈ మధ్యనే కొట్టేసినారంట. ఈ మధ్య మల్లారెడ్డికీ నాకూ ఒకసారి కొట్లాట జరిగింది. అదెట్లయిత్యందంటే.

నేను మహాసభలకోసం చందాలు వసూలుచేస్తూ మల్లారెడ్డి దగ్గరికి పోయినాను. ఇంటి బైటవున్న పెద్దాయన ఎందుకొచ్చినానో తనుక్కోని కూర్చోమన్నాడు.

కొంసేపు కూర్చున్నాక లోపలికి రమ్మని పిలిచినాడు.

లోపల మల్లారెడ్డితోపాటు ముగ్గురు వున్నారు. అందులో వొకరు ఎం. ఎల్. ఏ.

486

తమ్ముడు, సారా కాంట్రాక్టరు కూడా. లోపలికి పోంగానే కరపత్రం తీసి మల్లారెడ్డి కిచ్చి, చందాపుస్తకం బైటికి తీసినా.

"ఏం మల్లారెడ్డి, ఇంగా నీ కాడికి చందాల కొస్తున్నారా ?" ఎం. ఎల్. ఎ. తమ్ముడన్నాడు.

"అ! ఏదో పాత పరిచయాలు కదా" అంటూ చందా పుస్తకం తీస్కోని యాభై రూపాయలు రాసినాడు మల్లారెడ్డి.

అ యింత సేపూ నేను యిల్లంతా జూసినాను. ఇంట్లో మూడు నాలుగు సోఫాలు ఏసి పెట్నాడు. కింద తివాచీ పరిచివుంది. గొడలకేమో బ్రాండీ షాపుల కాలెండర్లు వేలాడుతున్నాయి. వాటిని చూడగానే మల్లారెడ్డిలో వచ్చిన మార్పు అర్థ మైంది. ఒకసారి కాలేజీలో అందాల పోటీలను విమర్శిస్తూ, మల్లారెడ్డి ఇచ్చిన ఉప న్యాసంకూడా గుర్తుకొచ్చింది. ఇవన్నీ ఆలోచిస్తున్న నాకు మల్లారెడ్డి మాటలు అడ్డం వొచ్చాయి.

"అవునూ ? ఏమిటీ మధ్య కిడ్నాపులు ఎక్కువగా చేస్తున్నారే, యిలాంటి టెర్రరిస్టు చర్యలన్నీ నచ్చటం లేదు. పార్టీలో ఎవరిష్టమొచ్చింది వాళ్ళు చేస్తున్నట్టు న్నారు" అన్నాడు. ఈ అనవసర మాటలతో నాకు కోపమొచ్చింది.

"గ్రామాల్లో యువకుల్నందర్నీ పోలీసులు కిడ్నాపుచేసి చంపేస్తున్నప్పుడు మీరేం మాట్లాడలేదే" గట్టిగా అన్నాను.

"వాటి గురించి గొడవ చేయటానికి పౌరహక్కుల సంఘాలు వున్నాయి కదా ?" చాలా తేలిగ్గా తీసిపారేశాడు.

"అవునుమరి, మీకది గొడవలాగానే కనిపిస్తుంది. వందలాదిమంది యువకు లను శవాలుచేసి, తల్లిదండ్రులకు కూడా తెలియకుండా దహనం చేస్తున్నప్పుడు నీలాంటి ప్రజాస్వామిక వాదులు ఏమీ మాట్లాడరు. గవర్నమెంటుకు ఏదైనా యిబ్బంది కలిగితే మాత్రం పూసుకోనొస్తారు".

"అయినా నాకెందుకొచ్చిన గొడవలే, బైట క్లర్కుదగ్గర యాభై తీసుకో" అన్నాడు.

యింతలోనే "యిగో ఒక విషయం" అంటూ నాతోపాటూ బైటికొచ్చినాడు.

"మన రెడ్డి సారాలీజు వున్న ప్రాంతంలో మనోళ్ళ రేటు తగ్గించాలని డిమాండు పెట్నారంటె. మన ఏరియాలో ఇంకా అది అమలు చేసేంత బలం లేదు కదా ? కాబట్టి అ పనొద్దు. పార్టీకి నేను ఇరవై వేలు చందాయిప్పిస్తా. రెండేండ్లు వాయిదా ఎయ్యమని మనోళ్ళతో చెప్పు. అయినా పార్టీతో మాలాంటి వాళ్ళకు శతృత్వం ఏముంటుంది. ఒకప్పుడు సింపతైజర్స్ కూడా" మల్లారెడ్డి క్షణంలో రంగు మార్చి నవ్వుతూ మాట్లాడుతున్నాడు. అసలు స్వరూపం తెలిసింది. అసహ్యం కలిగింది. ఆయన రాసిన యాభై రూపాయలు రసీదూ చించి అక్కడేపడేసి, బైటి కొచ్చినా. అ తరువాత మల్లారెడ్డిని ఎక్కడా కలవలేదు.

అట్లాంటి మల్లారెడ్డి దగ్గర రాములు ఉద్యోగంకోసం ఎట్లా పొయ్యేది ?! ఒకవేళ మల్లారెడ్డి దగ్గర వుద్యోగం వొచ్చినా, చేయటం రాములుకు చాతకాదు. తిరకాసొచ్చిందంటే కొట్నాకొస్తాడు. అందుకని ఆ పని వాయిదా వెయ్యటమే మేలు అనుకొని, సుబ్బయ్య వొస్తానన్నరోజు రూములో వుండకుండా సినిమాకు బోయినా. నా కోసం సుబ్బయ్య వొచ్చి వెనక్కి పొయ్యుంటాడేమో ?

దీపావళి సెలవులు కాబట్టి వూరికి పోదామని, స్కూలు కాంగానే బస్టాండు కొచ్చినాను. అరయినా, మా వూరిబస్సు రాలేదు. బస్టాండులో అటూ ఇటూ తిరుగుతూ వున్నాను. ఒకచోట చిన్న యూరియాసంచీ చేత్తోపట్కోని సుబ్బయ్య వొస్తున్నాడు. సుబ్బయ్యకు కనిపించకుండా మొగం చాటెయ్యటం మేలని ఎదురుగా వున్న పుస్తకాల అంగడిముందు నిలబడుకున్నా. సుబ్బయ్య నన్ను చూసుంటాడేమో? చూసీ పలకరించకుంటే ఏమనుకుంటాడో, పలకరిస్తే మళ్ళీ మల్లారెడ్డి దగ్గరకు పోదామంటాడేమో ? లక్ష అనుమానాలతో, ఇష్టం లేకపోయినా దిక్కుమాలిన సినిమా పత్రికలన్నీ చూస్తూ నిలబడినాను.

"ఏం సామీ, వూరికి పోతావుండావా ?" సుబ్బయ్య భుజంమీద చెయ్యేసి పలకరించినాడు సుబ్బయ్య అంత దగ్గరగా నన్నెప్పుడూ పలకరించలేదు.

"అవును సుబ్బయ్యా. రెండ్రోజులు సెలవులు. గంటసేపయ్యింది వొచ్చి, వొక్క బస్సూ రాలేదు. చీకటి పట్తా వుంది. ఆ రోజు ఆదివారం వొస్తానంటివి రాలేదే" తేలికగానే అపద్దం అడేసినా.

"వొద్దులేసామీ, మా వోడికి వుద్యోగం వొద్దు, ఇంటికాడ్నే వుంటాడు" నిబ్బ రంగా మాట్లాడినాడు.

488

చేతిలో సంచీజూసి "ఎక్కడ్నుంచి వస్తావున్నావు" అని అడిగినాను.

"పిలగాణ్ణి జూడను పట్నం బొయ్యుంటిసామీ"

"ఏం రాములు పూర్లో లేడా"

"లేడు" అని ఇష్టం లేనట్టుగా జవాబు చెప్పినాడు సుబ్బయ్య.

"సరే, రూముకు పోదాంరా, రాత్రికి యిప్పుడు నీకు మాత్రం బస్సు యాడ దొరుకుతుంది. పొద్దుణ్ణే పోదువుగాని", అని సుబ్బయ్యను వెంటబెట్టుకొని రూముకు బయలుదేరాను.

ఇద్దరం దార్లోనే తిండి తిన్నాం. దారెంట సుబ్బయ్య ఏమీ మాట్లాడలేదు తిండి తినేటప్పుడు కూడా ఏమీ మాట్లాడాలా. మొన్నొచ్చినప్పటి మాదిరి లేదు. మనిషి కొంచెం నిబ్బరంగున్నాడు. రాములుకు పట్నంల పుద్యోగం వొచ్చిందేమో అనుకున్నా.

× × ×

"మల్లారెడ్డి సారు మొన్న యాలం పాటల్లో మా సుట్టుపక్కల పూళ్ళు కొంటాక్టు తీసుకున్నాడు సామీ?" మెట్లు ఎక్కుతూ సుబ్బయ్య అన్నాడు.

నాకు ఈ విషయం యింతవరకూ తెలియదు. ఆ రోజు మల్లారెడ్డి రేటు తగ్గించే విషయం యిందుకోసమే మాట్లాడాడని అర్థమైంది.

ఎలాగూ మల్లారెడ్డి విషయం మాటల్లోకి వచ్చింది గదా, విషయం మొత్తం సుబ్బయ్యకు చెప్దామనుకున్నా. కానీ ఆయన, సంపాదన ఆస్తి చూసి వోర్వలేక ఇట్లా ప్రచారం చేస్తున్నాననుకుంటే బాగుండదు. అందుకని 'ఊ' అని ఊరుకున్నా.

రూము తాళం తీసి, సుబ్బయ్యకు వొక చాపా, దుప్పటీ యిచ్చి నేనొకటి తీస్కోని రూముబైట పంచలో కొచ్చినాం. సుబ్బయ్య మళ్ళీ ఏం మాట్లాడలేదు, నేను చాప ఏస్కోని, లైటు ఆర్పేసి బైటకొచ్చినా.

సుబ్బయ్య నా వైపు తిరిగి కూర్చున్నాడు. చిమ్మచీకట్లో సుబ్బయ్య మొహం కనిపించటం లేదు. బైటినుంచి పడుతున్న వెలుగుకు కళ్ళు మాత్రం కనిపిస్తున్నాయి. చూపులన్నీ నా వైపే వున్నట్టు అనిపించింది. ఏదో చెప్పటానికి ప్రయత్నిస్తున్నట్టుంది.

"పిలగాణ్ణి పోలీసులు పట్కబొయినారు" మెల్లగా గొణుగుతున్నట్టు అన్నాడు. సుబ్బయ్య ఈ విషయాన్ని యింతసేపటికి చెప్పటం ఆశ్చర్యాన్ని కలిగించింది.

489

"ఏంది సుబ్బయ్యా నువ్వు చెప్పింది, వూర్లో ఏమైనా కొట్లాటలైనాయా?

"అవున్సామీ? పోయిన పున్నం పక్కరోజు తీస్కపోయినారు. పట్నం జైల్లో బెట్నారు. తుక్కతుక్కగా కొట్నారు లంజకొడుకులు. పిలగాడు ఎట్ల తట్కున్నడో ఏమో? యిళ్ళింట్లో పీనిగెళ్ళ!"

"ఇంతకూ ఏమైందీ వూర్లో"

"మనూర్లో పీలిసికారోళ్ళు మొదట్నుంచి సారాయివోళ్ళే కాచుకుంటారు గదా, నువ్వు సూసినోడివే - మొన్న కొత్త కాంటాక్టులు యిచ్చినంక, సికారోళ్ళు గూడ సారాయి కాచుకోరాదనీ, అందరూ అంగట్లోనే కొనుక్కోవాల్నని దండోర ఏసిచ్చినారు. యింతకు ముందుమాదిరే లెమ్మని, సికారోళ్ళు యినిపిచ్చుకోలా. పున్నంరోజు, మునాషకి ఏమైందంటే............

× × ×

నాలుగు సారాయి జీపులు వూర్లోకొచ్చి ఆగినాయి. ముందు జీపులో ఒక ఎక్సైజు యినిస్పెక్టరు, ఇద్దరు కానిస్టేబుల్లు వున్నారు. మిగతా మూడు జీపుల్లో సారా కాంట్రాక్టరు మనుషులు వున్నారు. అందరి చేతుల్లో కర్రలు వున్నాయి. ఒకరి చేతిలో మాత్రం తుపాకీ వుంది. జీపులు ఆగుతూనే సారాయి కాంట్రాక్టరు మనుషులు గబ, గబా దిగినారు. సారాయి పోలీసులు జీపు దగ్గరనే వున్నారు.

కాంట్రాక్టరు మనుషుల్ని చూడగానే ముందుకొట్టం దగ్గరున్న ఆడామె లబలబ, గట్టిగా అరిచింది. అంతే, ఇండ్లల్లోంచి ఆడోళ్ళందరూ బైటికొచ్చినారు. అందరూ నోటిని చేత్తో కొట్టుకుంటూ ఒకటే అరుపులు, ఒక్క నిముషంలో వాతావరణమంతా బీభత్సంగా తయారైంది. ఆడవాళ్ళ అరుపులు వింటూనే ఇండ్లల్లో మొగోళ్ళందరూ వీధిలోనుంచి కాలువ గట్టు వైపుకు పరుగులు తీశారు. వాళ్ళవెంట కాంట్రాక్టరు మనుషులు. దొరికినోణ్ణి, దొరికినట్టు కుల్లబొడుస్తావున్నారు. కొంతమంది యిండ్లల్లోకి దూరారు. లోపలున్న ప్రతివస్తువునూ బైటికి ఇసిరేస్తున్నారు. కుండలన్నింటినీ పగలగొట్టాడు. ఆఖరుకు అన్నం మూకుట్లు కూడా వదిలిపెట్టలేదు. చిన్నా పెద్దా అని గూడ చూడకుండా కనిపిచ్చినోణ్ణి, కనిపిచ్చినట్టు సావగొట్టి జీపుల్లో ఏస్తావున్నారు. పోలీసులు మాత్రం నిమ్మళంగా జీపుదగ్గర బీడీలు కాల్చుకుంటూ వున్నారు. జీపులో యినిస్పెక్టరు కూర్చున్నాడు. యింతలో కాంట్రాక్టరు మనుషులకు ముసలి

అడ్డపడింది. "నాకొడుకును యిడిసి పెట్టండ్రో, కుండలన్నీ పగలగొట్నారు గదరో, మీ కండ్లు సల్లగైనాయిగదరో, నా కొడుకును యిడిసి పెట్టండ్రో", అని ఏడుస్తా వుంది. తుపాకీ వున్న మనిషి అమెను ఈడ్చి పక్కకు పారేశాడు. అయినా ముసిల్ది ఏడుపు ఆపలేదు - "మీకు దూము తగల, మీ పెండ్లాల పుస్తెలు తెగిపోనూ, నా కొడుకును సంపేసినారుగదరో", ఏడుస్తూనే వుంది.

సుమారు 60 మందిని తీసుకోని జీపులు పట్నంవైపు పోయినాయి.

రాత్రి తొమ్మిదిగంటలపుడు, తిండితిని కొట్టంబైట నులకమంచంలో కూర్చున్నాడు సుబ్బయ్య. బీడీ ముట్టిచ్చుకోడానికి అగ్గిపెట్టెతీసి పుల్లగీసినాడు. కొట్టం ముందు గూనోడు కనిపిచ్చినాడు.

"ఏరా ! గూనోడా బువ్వతిన్నావా ?" అన్నాడు సుబ్బయ్య.

"తిన్నామామా ? రాములుగాడు సేనికాన్నుంచి వొచ్చినాడా" గూనోడు గునిసినాడు. "పిలగాడు తింటావున్నాడు. ఏందిరా ! మళ్ళీ ఏమైనా యవ్వారమా ?"

"అవును మామా ? పొద్దున్న సికారోల్లను పట్కబోయినారు గదా ! మాట్లాడదామని" - అంటూ సగంలో అపి సుబ్బయ్య మొగంలోకి జూసినాడు గూనోడు.

"నియ్యవ్వ, మీకేం పంగులేందిరా ! పొద్దుగూకులా వూల్లో ఏదొచ్చినా ఈడికి వురుకొక్కనొస్తారు" విసుక్కున్నాడు సుబ్బయ్య.

ఇంతలో రాములు చెయ్యితుడుచుకుంటూ బైటకొచ్చినాడు. సుబ్బయ్య మాటలు పట్టిచ్చుకోకుండా "రారా ! గూనోడా" అంటూ ముందుకుబొయినాడు.

రాములూ, గూనోడు సత్రంకాడికి బొయ్యేటప్పటికి, సికారి ఆడోల్లు, మాలోల్లు జమయినారు. రాములుకు సంగతంతా జెప్పినారు. పొద్దున్నే అందర్నీ తీస్కోని మండలాఫీసుకాడికి వూరేగింపు తియ్యాలని రాములు చెప్పినాడు.

ఈ సంగతి తెలిసి ఎంగటాద్రినాయుడు రాత్రికిరాత్రి కంట్రాక్టరు ఇంటికి మనిషిని పంపిచ్చినాడు. అంతే మునిమాపున్నే, పోలీసోళ్ళు వూరిమీదబడి రాములును, గూనోణ్ణీ, సిన్నెంగటి కొడుకు మల్లన్ననీ, ఎంగటాద్రినాయుడు గాసగాడు మున్రా మున్ణీ పట్కబొయినారు.

× × ×

సుబ్బయ్య చెప్పిన ఈ కథ వినేసరికి నాకు నిరాశముంచుకొచ్చింది.

491

“పొద్దున్నే లేచి ఎంగటాద్రినాయుడు యింటికాడికి బొయ్యి నా కొడుకును యిడిపియ్యమని కాల్లు బట్టుకున్నా. రెండొందలు తీసోక్కొని, కొంట్రాక్టరు కాడికి పటుక్కబోయినారు. అప్పుడు చూసిన సామీ! మళ్ళీ మల్లారెడ్డి సారును “పిల్లగాన్ని యిడిపియ్యమనీ, యింగ సక్కంగ వుండకపోతే వూరిడిసి పోతామనీ వొట్టు బెట్టు కున్నా. “మల్లారెడ్డిసారు” సరే పోలీసోల్లతో మాట్లాడతా పొమ్మన్నాడు : పొద్దున్న పిల్లగాన్ని చూస్తే తెలిసింది మల్లారెడ్డి సారు ఏం జేసినాడో, జైలుకు తోలిచ్చేటట్టు సూడమని పోలీసోల్లకు జెప్పినాడంట. రెండు తుపాకుల్తో దొరికినట్టు కేసు బెట్నారు. ఏందైతదో ఏమో ?”

ఏదో వొక ఊరడింపు మాటలు చెప్పటం నాకు చేతకాలేదు.

“మల్లారెడ్డి విషయం నీకు ముందే చెప్పాలనుకున్నా సుబ్బయ్యా! మల్లారెడ్డి లాండివాళ్ళ వూరికి వొక్కడున్నా చాలు. ఇట్లాటోళ్ళుంటే, రాములులాంటివాళ్ళ ఎన్ని సంవత్సరాలు కష్టపడినా ఏమైతుండి”. నాకు ఎక్కడలేని దిగులు ముంచు కొచ్చింది. నాకు మాటలు రాలేదు. నా బాధ సుబ్బయ్యకు అర్థమైందో లేదో!

కిందనున్న దుప్పటితీసి సుబ్బయ్య తలకింద పెట్టుకోని పండుకున్నాడు. పైన చుక్కల్లోకి చూస్తూ మాట్లాడినాడు.

“నేను మొదట్లో మానాయనతోపాటు సేద్యం మొదులుబెట్నా. ఒక సంవత్స రం వానలే లేవు. ఏసిన యిత్తనాలు పోను, సద్దలు మాత్రం మిగిల్నాయి. రెండో ఏడు కనాకష్టం యిత్తనం కచ్చుగూడారాలా! మూడోఏడు మళ్ళీ యిత్తినా. పంట జూసి పండగ జేసుకున్నాం తీరా కోతలొచ్చేటయానికి తుపానొచ్చింది. తిండిగింజ లకు గూడ లేకపోతే ఎంగటాద్రినాయుడుకాడ నాగులు తెచ్చుకున్నాం. సేద్యం మానుకున్నానా? ఏస్తానేవున్నా - వొంట్లో సత్తువుండేంతవరకు ఏస్తానేవుంటా. మావోడు జైల్నుంచి బైటికొచ్చినాక మళ్ళీ పార్టీలోకిబొయినా బియంలేదు. సేద్య గాని కేంతిసామీ. చేతుల్లో నెత్తురున్నంతవరకు కష్టపడతాను. నాకింతకంటే కష్టాలు యింగేమొస్తాయి. పిలగాడేం నీతిమాలిన పన్లుజెయ్యలా. నేను సేద్యం జేసినట్టు, వోడూ చేస్తానే వుండాడు. నా సేద్యం నా కష్టాల్ని పోగొట్టలేకపోయినా, వాని సేద్యం మాత్రం పోగొడ్తాది”. సుబ్బయ్య మాటల్లో యాభైయేళ్ళ సేద్యం చేసిన రైతు పదును కనిపించింది.

492